క్లుప్తంగా

న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: గర్భిణులు రక్తహీనత మరియు శరీరంలో ఐరన్ లోపించకుండా సుఖప్రసవం జరిగేందుకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు ఉపయోగకరంగా పనిచేస్తుందని కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, వైద్యురాలు మాధురి, వైద్య సిబ్బంది రత్నలత, సుజాత, నవీన్, ప్రశాంత్, రఫీ, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



రాఘవేందర్ యాదవ్‌ను సన్మానించిన అతిథులు

బొంరాస్‌పేట: యాదవ విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా దుద్యాల మండలంలోని పోలెపల్లికి చెందిన రాఘవేందర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు యాదయ్య ఈ మేరకు బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, సునంద, విశ్వనాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ కాశీనాథ్‌కు సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దేముల్: ప్రతిఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని పెద్దేముల్ ఎస్‌ఐ కాశీనాథ్ అన్నారు. పెద్దేముల్ ఎస్‌ఐగా భాధ్యతలు తీసుకున్న ఆయన్ను బుధవారం బీఆర్‌ఎస్ మండల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, పలుగ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

'కాగ్నా' కష్టాలు తీరేదెప్పుడో?

డైవర్షన్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు

ధారూరు: అతను ధారూరు మండలం దోర్నాల్ బ్రాంచి పోస్టాఫీస్‌లో జీడీఎస్ ఎంసీగా విధులు నిర్వహిస్తున్నాడు. ధారూరు పోస్టాఫీసుకు వచ్చి ప్రజలకు బట్వాడా చేసేందుకు ఉత్తరాలు, డబ్బులు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం కాగ్నానది డైవర్షన్ రోడ్డుపై నుంచి నడుస్తూ వెళ్తూ.. పట్టుతప్పి నదిలో పడిపోయాడు. వెనకే వస్తున్న ఇద్దరు యువకులు అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. గతనెల 31న దోర్నాల్ గ్రామానికి చెందిన కొంతమంది యువకులు డైవర్షన్ రోడ్డుపై వేసిన సీసీ పైపులపై రాళ్లువేసి కాలినడకన రాకపోకలు చేసేందుకు దారి చేశారు. ఈ క్రమంలో కాగ్నానది నీటి ప్రవాహం కొద్దిగా తగ్గడంతో అత్యవసర పనులపై వెళ్తున్న ఉద్యోగులు, ఇతరులు డైవర్షన్ రోడ్డుపై నుంచి రెండు వైపులా దాటేందుకు ప్రయత్నిస్తూ పట్టుతప్పి పడిపోతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'తొలిమెట్టు'పై అవగాహన

బంట్వారం: తొలిమెట్టుపై బుధవారం బంట్వారం కోట్‌పల్లి మండల కేంద్రాల్లో ఎంఈఓ చంద్రప్ప ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన తొలిమెట్టుకు సంబంధించిన పలు అంశాలపై, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల బోధనపై వివరించారు. నిర్మాణాత్మక మూల్యాంకనం, పిల్లల ప్రతిస్పందనలు, అభ్యాసన పత్రాలు, ప్రాజెక్ట్ పని తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహణ కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీజేపీ నేత మారుతీకిరణ్

కుల్కచర్ల: రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తలకు తాము అండగా ఉంటామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ సంఘ ఖండ చాలక్, కుల్కచర్ల మాజీ సర్పంచ్ కొప్పెర ఎల్లయ్య అనారోగ్యంతో ఉన్నారు. విషయం తెలుసుకున్న మారుతికిరణ్ బుధవారం ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సమస్యల తిష్ట

- తరగతిగదులు లేక ఆరుబయట, కమ్యూనిటీ భవనాల్లో విద్యాబోధన
- పలు స్కూళ్లకు ఇప్పటికీ పర్మినెంట్ టీచర్‌ను కేటాయించని వైనం
- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఓంలానాయక్ తండాలో ఐదు తరగతులకు కలిపి ఆరుబయట విద్యాభోధన చేస్తున్న టీచర్

పెద్దేముల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. ఉపాధ్యాయులు ఉన్నచోట తరగతి గదులు కొరత... తరగతిగదులు ఉన్నచోట ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దేముల్ మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెత్తం 61 వరకు ఉన్నాయి. ఇందులో సుమారు 5,038 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండలంలో 45 ప్రాథమిక పాఠశాలలు తట్టెపల్లి, కందనెల్లితండా, అడ్కిచెర్ల, మారేపల్లి, మంబాపూర్, గాజీపూర్, నాగులపల్లి పాఠశాలలకు మినహా మిగితా పాఠశాలలకు పూర్తిస్థాయిల్లో గదులు లేక ఒకటి, రెండు గదుల్లో విద్యా బోధన కొనసాగుతోంది. పాషాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం రాంసింగ్‌తండా పాఠశాలకు సుమారు ఐదు సంవత్సరాల నుంచి పర్మినెంట్ టీచర్ లేరంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోంది. ఓంలానాయక్ తండాలో 1నుంచి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలకు కేవలం ఒకే టీచర్ ఉన్నారు. ఆ ఉన్న టీచర్ సెలవుపై వెళ్తే స్కూల్‌కు సెలవు ప్రకటించినట్లే అవుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ హాల్‌లో బోధన..

ఒంటిమామిడి తండా పాఠశాలకు గదులు ఉన్నా, కేవలం ఒకే టీచర్‌తో కొనసాగుతుంది. మదనంతపూర్‌లో పాఠశాల భవనం శిథిలావస్థలో ఉన్నప్పటికీ ప్రభుత్వం కొత్త భవనం మంజూరు చేయకపోవడంతో కమ్యూనిటీ హాల్‌లో విద్యాబోధన చేస్తున్నారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో అయినా కొత్త భవనాలు మంజూరు చేయాలని సర్పంచ్ గోవర్ధన్ నాయక్ కోరుతున్నారు. రచ్చకట్ట తండా పాఠశాలలో కేవలం ఒకే గది ఉంది. మండలంలోని కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్న తండాల విద్యార్థులకు సరైన విద్య అందటం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వ బడుల్లో తరగతి గదులు నిర్మించడంతో పాటు అవసరమైన చోట శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



మండల పరధిలోని ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల, తరగతిగదుల కొరత ఉన్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు ఈ విషయమై సంప్రదించారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాను. మరోసారి వారికి పరిస్థితిని వివరించి వారి నుంచి ఆదేశాలు రాగానే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– వెంకటయ్య, మండల విద్యాధికారి, పెద్దేముల్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్



మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప

కొడంగల్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా గత సమావేశం నుంచి ఇప్పటివరకు గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులపై అధికారులు నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గత సమావేశంలో నివేదించిన సమస్యలను అధికారులు ఈ సమావేశం వరకు పరిష్కరించకపోతే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతోపాటు గ్రామాల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడంతో పాటు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రహమతుల్లాఖాన్, ఎంపీడీఓ పాండు, ఎంఈఓ రాంరెడ్డి, సీడీపీఓ జయరాం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్



స్కూల్ బస్సులను తనఖీ చేస్తున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్

మర్పల్లి: ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిభందనలు పాటించాలని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మర్పల్లి ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఆయన స్కూల్ బస్సుల తనఖీలు చేపట్టారు. వివిధ స్కూల్ బస్సులకు సంభందించిన పత్రాలను చెక్ చేశారు. బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్ వంటి కాగితాలను పరిశీలించారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకుపోవద్దన్నారు. మలుపుల వద్ద వాహనాల స్పీడ్ తగ్గించి వెళ్లాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ప్రారంభం



శిక్షణను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ రాంరెడ్డి

బొంరాస్‌పేట: మండల స్థాయిలో ఉపాధ్యాయులు, ప్రాధానోపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫౌండేషన్, లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 2 నుంచి 8వరకు జరిగే శిక్షణా తరగతులను మొదటిరోజు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఆర్పీలు శ్రీప్రియ, నరేందర్, దుద్యాలలో ఈర్లపల్లి వెంకటయ్య, శ్రీకాంత్ ఇచ్చారు. బొంరాస్‌పేట మండలంలో 34, దుద్యాలలో 16 మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎంఈఓ రాంరెడ్డి పర్యవేక్షించారు. బొంరాస్‌పేట మండలంలో సీఆర్‌పీలు సోమ్లా, శంకరయ్య, ఎమ్మార్సీ సిబ్బంది గౌసుద్దీన్, దుద్యాల మండలంలో సీఆర్‌పీ రాందాస్ పాల్గొన్నారు. రెండోరోజు గురువారం తెలుగు భాషకు సంబంధించి తరగతులను కొనసాగిస్తామన్నారు. అలాగే 4, 5వ తేదీన ఆంగ్లం, 7, 8వ తేదీన గణితంపై శిక్షణ ఇవ్వనున్నారని అధికారులు తెలిపారు.

కిష్టప్పకు అండగా ఉంటాం

జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్



కిష్టప్పకు నగదు అందజేస్తున్న శ్రీనివాస్

ధారూరు: ధారూరు రైల్వేస్టేషన్ సమీప పట్టాలపై వెళ్తూ రైలు ఢీకొని 80గొర్రెలు మృత్యువాతపడటం, ఆర్థికంగా నష్టపోయిన యజమానికి బుధవారం జిల్లా కురుమ సంఘం రూ.25వేలు అందజేసింది. దోర్నాల్ గ్రామానికి చెందిన కిష్టప్ప గొర్రెలు.. ఊరపందులకు భయపడి రైలు పట్టాలపై చేరడం, హుబ్లీ రైలు వేగంగా వస్తూ వాటిని ఢీకొంటూ వెళ్లింది. వాటిలో 50 గొర్రెలు సంఘటనా స్థలంలో మృత్యువాత పడగా గాయపడ్డ వాటిలో మరో 30 గొర్రెలు తర్వాత చనిపోయాయి. తన ఆస్తే గొర్రెలుగా భావించే కిష్టప్ప ఆర్థికంగా నష్టపోయి అప్పుల్లో కూరుకపోయాడని ఈ సందర్భంగా జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. దోర్నాల్ గ్రామానికి వెళ్లి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.25వేలు ఇచ్చి కొంతవరకు ఆదుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం అనంత్‌రెడ్డి, జిల్లా కురుమ సంఘం నాయకులు గోపాల్, శ్రీనివాస్, యాదయ్య, నర్సింహులు, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాడుతాం

రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కొండల్ యాదవ్



నియామకపత్రం అందుకుంటున్న కొండల్‌యాదవ్

నవాబుపేట: తెలంగాణ రైతుహక్కుల సాధన సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నవాబ్‌పేట మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన కొండల్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం కొండల్ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు బాలు యాదవ్, ఉపాధ్యక్షుడు రఘుపతి యాదవుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా రైతుల పక్షాన నిలబడి వారి న్యాయమైన హక్కుల కోసం పోరాడుతానన్నారు. త్వరలోనే జిల్లాలో మండల కమిటీలు వేస్తామన్నారు. ప్రభుత్వపరంగా వచ్చే పథకాల సాధన కోసం కృషిచేస్తానన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డిని నియమించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రాము, నాయకులు నందు, శివకుమార్ పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుద్ధ్య పనులు

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ సిబ్బంది పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందును పిచికారీ చేశారు. పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని.. చెత్తను మున్సిపల్ చెత్త తీసుకెళ్లే వాహనాల్లో వేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి: ఏఈఓ

మర్పల్లి: రైతుబీమాకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 5వరకు గడువు ఉందని పట్లూర్ క్లస్టర్ ఏఈఓ ప్రశాంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పట్లూర్ గ్రామ పంచాయతీలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను ఆయన స్వీకరించారు. పట్లూర్ గ్రామంలో 1,350 మంది రైతులు ఉన్నారని ఈ పథకం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇంతవరకు 1,050 మంది రైతులు రైతు బీమా చేసుకున్నారని అన్నారు. మరో 300 మంది రైతులు మిగిలి ఉన్నారని బీమా చేయించుకోని రైతులు ఈనెల 5వ తేదీలోపు చేసుకునే విధంగా గ్రామంలో మరో సారి దండోర వేయాలని సర్పంచ్ ఇందిర అశోక్‌కు సూచించారు.

మిగిలింది రెండు రోజులే..

మోమిన్‌పేట: రైతు బీమాకు దరఖాస్తు చేసుకొనేందుకు ఇక రెండు రోజులే మిగిలి ఉందని ఏఈఓ పెంటయ్య పేర్కొన్నారు. జూన్ 19వ తేదీ లోపు నూతన పట్టాదారుగా పాసుపుస్తకం పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటు రైతు బీమా ఫాంను నింపి ఇవ్వాలని ఆయన తెలిపారు. రైతువేదిక క్లస్టర్‌లోని ఏఈఓలకు ఇవ్వాలని ఆయన సూచించారు.

కేజీబీవీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

అనంతగిరి: ఆర్టీసీ తరహాలో కేజీబీవీ సిబ్బందికి న్యాయం చేయాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విద్య అభివృద్ధి, బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా 2014లో దేశవ్యాప్తంగా కేజీబీవీలను ప్రారంభించారన్నారు. కేవలం మహిళా సిబ్బందిచే నడుపబడుతున్నటువంటి కేజీబీవీలు నేడు బాల్య వివాహాలను నిర్మూలనతో పాటు బాలిక విద్య అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. ఈ విభాగంలోని సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించండి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి

అనంతగిరి: వికారాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహాలకు వెంటనే సొంత భవనాలు నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు వికారాబాద్‌లోని పలు హాస్టళ్లను బుధవారం ఆయన సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సొంత భవనాలు లేక చాలీచాలని ఇరుకు గద్దుల్లోనే ఉంటున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల పాకెట్‌మనీని రూ.500 నుంచి రూ.1000కి పెంచాలన్నారు. హాస్టల్‌లో రెగ్యులర్‌గా డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. కనీస వసతులు వెంటనే కల్పించాలన్నారు. విద్యార్థుల పక్షాన పోరాడుతామన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి కృషి



దోమ: విరాళం అందజేస్తున్న శరత్ కుమార్‌రెడ్డి

కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి

దోమ: ఆలయాల నిర్మాణాలకు తనవంతు కృషి చేస్తానని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు శరత్ కుమార్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఎల్లమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం ఆయన భూమి చేశారు. తనవంతు సహాయంగా రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, ఎంపీటీసీ బసప్ప, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, ఆలయ కమిటీ చైర్మన్ రామన్నమాదిగ, వైస్ చైర్మన్ బాలయ్య, గ్రామ బూత్ అధ్యక్షుడు నందు, బీజేపీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, మణికంఠ, శ్రీనివాస్, రియాజ్, రమేశ్, దస్తయ్య, చెన్నయ్య, వెంకటయ్య, శ్రీను, కాశయ్య, బాలప్ప, అనంతయ్య, చిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

మర్పల్లి: మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (62) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.కొండల్‌రెడ్డి మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ట్రస్టు సభ్యుల ద్వారా అందజేశారు. సభ్యులు చుక్కారెడ్డి, అంతయ్య, రాజయ్య తదితరులు ఉన్నారు.

పిల్లలను చదివించండి

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం



అవగాహన కల్పిస్తున్న వెంకటేశం

తాండూరు రూరల్: పిల్లలను పనిలో పెట్టవద్దని.. వారిని చదివించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం అన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ ముస్కాన్ కింద తాండూరులో 51 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా దుకాణాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించామన్నారు. బాలల పరిరక్షణ విభాగం, పోలీస్, లేబర్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ఆపరేషన్ నిర్వహించామని తెలిపారు. దుకాణ యజమానులు బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. నలుగురు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 49 మంది దుకాణదారులకు ఫైన్ వేశామన్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అందుకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకరిస్తుందని చెప్పారు. కమిటీ సభ్యులు సంగమేష్, ప్రకాష్, లీగల్ ఆఫీసర్ నరేష్, కౌన్సిలర్ లక్ష్మణ్, చైల్డ్‌లైన్ నర్సింహులుఉన్నారు.

మర్పల్లికి హాస్టల్ మంజూరు చేయండి

బీసీ విద్యార్థి సంఘం నేత లక్ష్మణ్



జిల్లా అధికారికి వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

మర్పల్లి: మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా హాస్టల్ మంజూర్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ జాయింట్ కన్వీనర్ ఈశ్వర్, బీసీసంఘం రాష్ట ప్రధానకార్యదర్శిలక్ష్మణ్.. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో 1983లో మర్పల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను అప్పటి ప్రభుత్వం మంజూర్ చేసిందని అన్నారు. 1983 నుండి మర్పల్లి జూనియర్ కళాశాల మంచి రిజల్ట్స్‌తో ఎంతో పేరు సంపాదించిందన్నారు. ఇక్కడ చదివే పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వారికి హాస్టల్ మంజూర్ చేయాలని ఇప్పటికే బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకు సైతం వినతిపత్రాలు ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీసీ నాయకులు వెంకటేశం, కృష్ణ, లక్ష్మణ్, పాండుయాదవ్ తదితరులు ఉన్నారు.

వివాదాస్పద ఇంటి స్థలంలో అధికారుల సర్వే

బషీరాబాద్: మండలంలోని నంద్యానాయక్ తండాలో వివాదం నెలకొన్న ఇంటి జాగలో రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే చేశారు. తన ఇంటి జాగను పక్కింటి వ్యక్తి కిషన్‌నాయక్ ఆక్రమించుకున్నాడని నాలుగు రోజుల కిందట జిల్లా కలెక్టర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలతో బుధవారం ఆర్ఐ రాకేష్, సర్వేయర్ ప్రభు పాండ్యానాయక్ ఇంటి జాగను కొలిచారు. వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించి తండా వాసుల సమక్షంలో పంచనామా చేశారు. ఆ స్థలం పాండ్యానాయక్‌దా..? కిషన్‌నాయక్‌దా అనేది తహసీల్దార్‌కు సర్వే రిపోర్టు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ జాగ విషయంలో ఇరువురి మధ్య గతంలో జరిగిన గొడవలో 5 మందిపై కేసులు నమోదయ్యాయి. స్థల వివాదంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండాలి

డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్

కుల్కచర్ల: విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండాలని డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామ పరిధిలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెనూ ప్రకారంగా భోజనాన్ని అందించాలని కూరలు నాణ్యతగా ఉండాలని, నీళ్లలా ఉండరాదని పేర్కొన్నారు. వంటల్లో నాణ్యత పాటించని స్కూళ్ల సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో స్వచ్ఛతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కరీం, మండల విద్యాధికారి హబీబ్‌అహ్మద్, స్థానిక సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి

సీడీపీఓ వెంకటేశ్వరమ్మ



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధారూరు: బిడ్డ పుట్టిన గంట వ్యవధిలో తల్లి ముర్రుపాలు తాగించాలని వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అన్నారు. ధారూరు మండల పరిధిలోని కేరెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. వ్యాధులు రాకుండా బిడ్డను జీవితకాలం కాపడుతుందని అన్నారు. ఏఎన్‌ఎం అనసూయ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం..

కుల్కచర్ల: పుట్టినబిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని కుల్కచర్ల వైద్యురాలు ప్రశాంతి అన్నారు. బుధవారం చౌడాపూర్ గ్రామ అంగన్‌వాడీఉపకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్పన, వసంత, శ్వేత, సునీత, అంజూ, జ్యోతి, యాదమ్మ, యాదమ్మ, జంగమ్మ, గోవిందమ్మ, పుష్పమ్మ, పుష్పలత, హన్మంతుబీ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.